నిర్మాణం.. ఇంకా ఎన్నాళ్లు?

• అసంపూర్తిగా పాఠశాల భవన నిర్మాణం • ఒకే భవనంలో రెండు పాఠశాలలు • విద్యార్థులు, ఉపాధ్యాయుల తీవ్ర ఇబ్బందులు • పట్టించుకోని అధికారులు


సీతాఫల్‌మండిలో నిలిచిపోయిన పాఠశాల భవనం నిర్మాణ పనులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఒకే భవనంలో రెండు పాఠశాలు కొనసాగుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కొత్త భవనం నిర్మిస్తుండటంతో నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఆ పాఠశాలను ఓయూ మోడల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నారు. అయితే ఏడాది క్రితం ప్రారంభమైన కొత్త పాఠశాల భవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు వసతులు సరిపోక సతమతమవుతున్నారు.

- ఓయూ మోడల్ స్కూల్ ఉదయం 9 నుంచి 3.30 కాగా, సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలను రెండు పూటలు కొనసాగిస్తున్నారు.
- రెండు పాఠశాలలకు చెందిన సుమారు 900 మంది విద్యార్థులకు ప్రధానంగా తాగునీటి సమస్య ఉంది. గతంలో స్థానిక కార్పొరేటర్ హేమా నీటి కోసం మున్సిపల్ నల్ల కనెక్షన్ ఉచితంగా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అయినా కానీ ఇంత వరకు నల్లా కనెక్షన్ ఇవ్వలేదు.
- మరుగు దొడ్లు, మూత్రశాలలు రెండు స్కూళ్ల విద్యార్థులు వినియోగించడం వలన శుభ్రపరిచే సిబ్బంది లేనందున దుర్గంధం వెదజల్లుతోంది.
- నిధుల కొరత కారణంగా పాఠశాల భవనం నిర్వహణ సరిగా లేనందున రెండు పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు.
- సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్మిస్తున్న పాఠశాల భవనం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వ పాఠశాలతో పాటు జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థుల కోసం ఒకే చోట కాంప్లెక్స్ మాదిరి భవనాన్ని నిర్మిస్తున్నారు.
- ఏడాది క్రితం ప్రారంభమైన భవన నిర్మాణ పనులు పిల్లర్లతోనే నిలిచిపోయాయి.


ఓయూ మోడల్ స్కూల్ ..

- విద్యార్థులు సీతాఫల్‌మండి నుంచి ఓయూ మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల వలన నడుచుకుంటూ సీతాఫల్‌మండి నుంచి రైల్వే ట్రాక్ దాటి ఓయూ మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటే 1 నుంచి 5వ తరగతి చదివే చిన్నారుల తల్లిదండ్రులకు రోజు టెన్షనే.
- కుక్కల భయంతో పాటు రైల్వే ట్రాక్ దాటడం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే పద్మారావు అనేక సార్లు అడిగినా పట్టించుకోవడం లేదని సిబ్బంది తెలిపారు. ఇపట్నికైనా భవనం పాఠశాల భవన నిర్మాణాన్ని తర్వరగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


డిప్యూటీ మేయర్‌ను కలిసిన శానిటేషన్ డీఈ

లాలాపేట: వర్షాకాలం నేపద్యంలో దోమలు ప్రబలకుండా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టితో ముందుకు వెళ్లాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు ఇటీవల నూతనంగా సానిటేషన్ డీఈగా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్ డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాక డివిజన్‌లో పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన చర్యలను ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ అధికారులకు సూచించారు.

రోడ్లపైనే వ్యాపారాలు

రోడ్డుపై ఏర్పాటు చేసిన వ్యాపారాలను తొలగించాలి

లాలాపేట: ఓల్డ్ లాలాపేట కమాన్ వీధిలో కొందరు దుస్తుల వ్యాపారులు రోడ్డుపై వరకు తమ వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని కొనసాగిస్తున్నారు. దీంతో సాయంత్రం వేళ ఈ మార్గం గుండా రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ విషయమై స్థానికులు, వ్యాపారుల మధ్య తరచుగా తగాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలనీ ఓల్డ్ లాలాపేట వాసులు కోరుతున్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలి

రాంగోపాల్‌పేట్: మేయర్‌గా, సీనియర్ జర్నలిస్టుగా ఎన్నో సేవలు అందించిన కృష్ణస్వామి ముదిరాజ్ 131 జయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలని అఖిల భారత ముదిరాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేష్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుగా, మేయర్‌గా ఆయన ఎనలేని సేవలు అందించారని వాటిని బావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

అనధికారిక పార్కింగ్ చార్జీలకు చెక్

సనత్‌నగర్: అనధికారిక పార్కింగ్ చార్జీల వసూళ్లపై జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనదారుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తూ లక్షలకు పడగలెత్తిన వారి ఆట కట్టించారు. అక్రమ వసూళ్లపై సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బేగంపేట పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద గత 12 ఏళ్లుగా అక్రమంగా పార్కింగ్ వసూళ్ల పర్వం కొనసాగుతోంది. పాస్‌పోర్ట్ సేవా కేంద్రానికి ప్రతిరోజూ వందల సంఖ్యలో పాస్‌పోర్ట్ సేవలు పొందేందుకు వస్తుంటారు. వీరితో పాటు చుట్టుపక్కల వాణిజ్య భవనాలకు వచ్చే వారి సంఖ్య అనేకం. ఈ క్రమంలో ఇక్కడి భవనాలకు సరైన పార్కింగ్ సౌకర్యం లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమంగా ఫీజు వసూళ్ల దందా కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటూ వస్తున్నారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రం వద్ద ఓ భవనం సెల్లార్‌లో కారుకు గంటకు రూ.50 చొప్పున సూలు చేస్తున్నట్లుగా మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అక్కడ అక్రమ పార్కింగ్ దందా వ్యవహారం బయటపడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉప కమిషనర్ సమ్మయ్య గరువారం ఆ ప్రాంతాన్ని సందర్శించి పార్కింగ్ ఫీజు వసూళ్ల విషయమై విచారణ జరిపారు. పార్కింగ్‌కు రశీదు కూడా లేకపోవడంతో జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు ఆయన తేల్చారు. ఇకముందు అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఆయన బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈఎస్‌ఐసీకి గెస్చర్ ఆఫ్ అప్రిసియేషన్


అవార్డు అందుకుంటున్న వైద్యులు

అమీర్‌పేట: కోవిడ్ 19 విపత్తులో అత్యుత్తమమైన వైద్య సేవలు అందించినందుకు సనత్‌నగర్ ఈఎస్‌ఐసీకి గెస్చర్ ఆఫ్ అప్రిసియేషన్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ చాటిన ఆసుపత్రులను గుర్తించి అవార్డులు అందించి సత్కరించిచారు. సనత్‌నగర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు రాజీవ్ కుమార్ బండారు, మెహిదీ అలీ మీర్జాలు అవార్డును నీతి ఆయోగ్ సభ్యులు వినోద్ పాల్, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహల్ చేతుల మీదుగా అందుకున్నారు.

హస్త కళాకారులను ఆదరించాలి

టీహెచ్‌డీసీ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ


చేనేత వస్త్రాలను తిలకిస్తున్న సత్యనారాయణ, నిర్వాహకురాలు పద్మజ

కవాడిగూడ: దేశంలోని పలు రాష్ట్రాలలో చేనేత డ్వాక్రా మహిళలను ఆధరించాలని తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీహెచ్‌డీసీ) ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ స్టేడియంలో శ్రీసాయి స్వశక్తి మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీసాయి చేనేత కాటన్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల వృత్తి కళాకారులకు సంబంధించిన చేనేత వస్త్రాలు, ఇతర వస్తువులు అద్భుతంగా రూపొందించారని ఆయన కొనియాడారు. నిర్వాహకురాలు ఖమ్మంపాటి పద్మజ మాట్లాడుతూ... ఈ ప్రదర్శన అన్ని సెలవు దినాలతో పాటు సెప్టెంబర్ 29 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరించండి


సీఈఓ మధుకర్ నాయక్ వినతి పత్రం అందజేస్తున్న తెలుకుంట సతీష్ గుప్తా

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఐదోవార్డు పరిధిలోని పలు కాలనీలు,బస్తీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే నీటి సరఫరాను మెరుగుపర్చాలని కాంగ్రెస్ నేత తేలుకుంట సతీష్ గుప్తా డిమాండ్ చేశారు. ఈ మేరకు వివిధ కాలనీలు, బస్తీ సంక్షేమ సంఘాల నేతలతో పాటు, సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పలు కాలనీల్లో నాలుగైదు రోజుకు ఒక్కసారి, అది కూడా గంటసేపు మాత్రమే తాగునీటి సరఫరా కొనసాగుతుందని సీఈఓకు విన్నవించారు. జీహెచ్‌ఎంసీలో మాదిరిగా రోజు విడిచి రోజు నీటి సరఫరా జరిగేలా చూడాలని సీఈఓను కోరారు. ఆయా కాలనీల్లో నీటి సరఫరా తీరుపై సమీక్షించి, నీటి లభ్యతకు అనుగుణంగా సరఫరా మెరుగుపరుస్తామని సీఈఓ హామీ ఇచ్చారు. సీఈఓను కలిసి వారిలో శోభనా కాలనీ అధ్యక్షుల కరుణాకర్ రెడ్డి, ఇంద్రపురి రైల్వే కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్, గణేశ్ నగర్ కాలనీ అధ్యక్షులు అజయ్, పీ అండ్ టీ కాలనీ సభ్యులు మోహన్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న శంకర్ రాజు

రసూల్‌పురా : మైనర్లు వాహనాలు నడపరాదని అది చట్టరీత్యా నేరమని అలా వాహనాలు నడిపితే తల్లిదండ్రులు, వాహన యజమానికి జైలు శిక్ష విధిస్తారని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్ రాజు తెలిపారు. గురువారం తిరుమలగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శంకర్ రాజు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ జేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడ తప్పని సరి హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హిరణ్య. ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరిగిపడ్డ చెట్ల కొమ్మల తొలగింపు


శాంతినగర్‌లో రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్టు


ఒరిగిపోయిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. శాంతినగర్ నుంచి తక్షశిలా స్కూల్‌కు వెళ్లే మార్గంలో, తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ ముందు చెన్నారెడ్డి వీధిలో, తార్నాక స్ట్రీట్ నెంబర్ 2 ప్రాంతాల్లో ఏపుగా పెరిన చెట్లు నేలకూలాయి. దీంతో స్థానికల ఫిర్యాదుతో జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది వచ్చ విరిగి పడ్డ చెట్లను తొలగించారు. దీంతో పలు ప్రాంతాల్లో కొంత సేపు రాకపోకలకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తార్నాకలో చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పర్యవేక్షించారు. సెయింట్ ఆన్స్ స్కూల్ ముందు రోడ్డులో ఒక వైపు ఒరిగిన చెట్టును తొలగించాలనీ స్థానిక బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్న అధికారులకు ఫిర్యాదు చేయగా వారు స్పందించారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా కిలోల రూ.17, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 18, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 26, పందిరి బీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూలో స్పేస్ ఆన్ వీల్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ కాలేజీ ఈసీఈ విభాగం, ఎన్‌ఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. గురువారం ఈసీఈ విభాగం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాజరై ప్రారంభించారు. నగరంలోని వివిధ కాలేజీలు, స్కూల్స్ నుంచి వచ్చిన విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, ఇస్రో సైంటిస్టు డా.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్టు నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఏళ్ల తరబడిగా తక్కువ వేతనానికి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం పర్మనెంట్ చేయలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్ ఉద్యోగాలను పర్మనెంట్ చేస్తామని మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా కాంట్రాక్టు ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని సంఘం అధ్యక్షులు చందర్ కోరారు.

ఓయూ భూమి కబ్జాను అడ్డుకున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూమి కబ్జాను విద్యార్థి నేతలు అడ్డుకున్నారు. గురువారం హబ్సిగూడ వైపు గల 20 గుంటల ఖాళీ స్థలంలో నాటిన ఓయూ బోర్డును ప్రైవేటు వ్యక్తులు తొలగించారు. బోర్డు తొలగింపును గమనించిన ఓయూ చీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్ రావు, కాంట్రాక్టు అధ్యాపకులు ప్రేమ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి వాగ్వివాదానికి దిగారు. విషయమై వర్సిటీ అధికారులు స్పందించ లేదు.

26న నగర తొలి మేయర్ కృష్ణస్వామి జయంతి వేడుకలు


ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

బన్సీలాల్‌పేట్: హైద్రాబాద్ నగర తొలి మేయర్, సంఘ సంస్కర్త కొర్వి క్రిష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతి ఉత్సవాలు ఈ నెల 26న జరుగనున్నాయి. బోయిగూడ ముదిరాజ్ సంఘంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు డి. సదానంద్, దివాకర్, సురేందర్, శ్రీకాంత్‌లు విలేకరులతో మాట్లాడుతూ.. క్రిష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి విస్తతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతున్నారని వివరించారు. వివిధ రంగాల్లో సేవలందించిన ముదిరాజ్ ప్రముఖులను ఈ సందర్భంగా సన్మానిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు నరేష్, మన్మోహన్, వెంకట్‌రావు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఆర్ విద్యార్థుల 'ఫ్లాష్ మాబ్'


బోయిన్‌పల్లిలో ఎస్‌పీఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థుల ఫ్లాష్ మాబ్ దృశ్యాలు

కంటోన్మెంట్: మహిళా సంరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం అని ఎస్‌పీఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ రణధీర్ రెడ్డి అన్నారు. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అకృత్యాలను నిరసిస్తూ, మహిళా సంరక్షణ పట్ల అవగాహన కలిగించేలా ఎస్‌పీఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. బోయిన్‌పల్లి చౌరస్తా మొదలుకుని వివిధ కాలనీలు, బస్తీల్లోని రహదారుల గుండా ఈ ప్రదర్శనలు సాగాయి. నృత్యరూపకాలు, వీధినాటకాలు, ప్లకార్డుల ప్రదర్శనలతో మహిళా సంరక్షణ పట్ల అవగాహన కల్పిస్తూ విద్యార్థుల ప్రచారం సాగింది. సమాజంలో మహిళలను గౌరవించేలా పూర్తిస్థాయిలో పరివర్తన వచ్చినప్పుడే, మహిళలపై అకృత్యాలు ఆగుతాయని రణదీర్ రెడ్డి అన్నారు.

కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ నేతల ధర్నా


ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

రసూల్‌పురా: తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కంటోన్మెంట్‌లో ధర్నా కార్యక్రమాలు జరిగాయి. బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్నానగర్ చౌరస్తాలోని తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. సీం రేవంత్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయికిరణ్, కనకయ్య. శ్రీనివాస ముదిరాజ్, ధనుంజయ్. సన్ని, కుమార్, అక్తర్, మదు, ప్రకాష్, శేఖర్, సుదర్శన్, అశోక్. రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


మాట్లాడుతున్న సీనియర్ కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, తోలుపునూరి కృష్ణాగౌడ్

చిక్కడపల్లి: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 23 నుంచి మండల కేంద్రాలు, 27 నుంచి జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నామని, రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గురువారం ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ.. రెండు లక్షల లోపు రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులుండగా.. 42 లక్షల మందికే బ్యాంకులు రుణాలిచ్చాయని ఇందులో రూ.22 లక్షల మందికే మాఫీ జరిగిందన్నారు. నేతలు సారంపల్లి మల్లారెడ్డి, బాలకృష్ణ, వెంకటాచారి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకునేదెవరు?

మంచినీటి లీకేజీలను పట్టించుకోని అధికారులు

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో మంచినీటి లీకేజీలతో రోడ్లు జలమయంగా మారుతున్నాయి. రోజుల తరబడి నుంచి మ్యాన్‌హోల్స్ నుంచి మంచినీరు రోడ్లపై ఏరులై పారుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రధాన రహదారులు, బస్తీలు, మురికివాడల్లో ఎక్కడపడితే అక్కడ రోజుల తరబడి నుంచి నీళ్లు రోడ్లపై వృథాగా పాతున్నాయి. అయితే జలమండలి అధికారులు లీకేజీలపై మాత్రం దృష్టిసారించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

- పద్మారావునగర్, బోయిగూడ, రాణిగంజ్, మోండా మార్కెట్, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై మంచినీటి లీకేజీలు కొనసాగుతున్నాయి.
- పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని స్వరాజ్య ప్రింటింగ్ ప్రెస్ ఎదురుగా ఉన్న రోడ్డుపై మ్యానుహోల్ నుంచి మంచినీరు ఏరులైపారుతున్నది. మంచినీటి లీకేజీల కారణంగా రోడ్లు పాడైపోతున్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రజలు రాకపోకలు సాగించడం కష్టతరంగా మారుతున్నది. ముఖ్యంగా బీటీ రోడ్లు దెబ్బతింటున్నాయి.

డ్రైనేజీ కంపు....

- పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో మురికినీరు రోడ్లపై ఏరులైపారుతున్నది. డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. పద్మారావునగర్ ఎస్‌బీఐ సమీపంలోని చౌరస్తా, అదే విధంగా గరుండా ప్రాంతంలో మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోంద. ఇప్పటికైనా డ్రైనేజీ మ్యానుహోల్స్‌లో చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసి మురికినీటి సమస్యను దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పద్మారావునగర్ ప్రధాన రహదారిలో మంచినీటి లీకేజీ

మ్యాన్‌హోల్‌ను పట్టించుకోండి..


సనత్‌నగర్ తులసీనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్..

సనత్‌నగర్: సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని తులసీనగర్ కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో మ్యాన్‌హోల్ మూత కిందకు కుంగి ప్రమాదకరంగా మారింది. దీనిపై స్థానికులు పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదును పరిశీలించకుండానే అధికారులు ఇంకో అడుగు ముందుకువేసి పరిష్కారమైపోయిందంటూ ఆన్‌లైన్‌లోనే జవాబు ఇచ్చేయడం గమనార్హం. కేవలం మ్యాన్‌హోల్ చుట్టూ ఫెన్సింగ్ రాడ్‌లు వేసి చేతులు దులుపుకున్నారే తప్ప మ్యాన్‌హోల్ పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379